# చుట్టాలొస్తున్నారు జాగ్రత్త!

సాయంత్రం ఇల్లు జేరగానే కరెంటు లేదని తిట్టుకుంటూ బూట్లు విప్పి విసుగ్గా పారేసిన రవి ఈనాడు మరి కాస్త 'టెంపో'లో ఉన్నట్లు గ్రహించింది లలిత.

గ్లాసునిండా నీళ్ళందించి అలాగే నుంచున్న భార్యకొక ఇన్‌లెండ్ కవరు అందించి ఆమె ముఖంలో మారబోయే రంగులకోసం ఆత్రంగా చూస్తున్నాడు

నొసలు చిట్లించి పెదాలు వికృతంగా వొంచి అంది : "మీ ఫ్రెండ్‌కు కనీసపు మర్యాదలు కూడా తెలిసినట్లు లేవు" అంటూ ఉత్తరం తిరిగిచ్చేసింది. ఆ కనీసపు మర్యాద ఉండబట్టే తన బావ- అంటే తన భర్త అంటే రవికిఉద్యోగం ఇప్పించిన సంగతి తెలిసినా ఆ క్షణంలో విస్మరించింది. ఉత్తరాన్ని భాగవతం చదివే పోజులో చేతులు వ్రేళ్ళుతిప్పుతూ భావయుక్తంగా చదివి, వుండ మూలకు విసిరేసింది.

రవి-ప్రసాదులు కలిసి విశాఖలో ఎం. ఏ. చదివారు. ప్రాణస్నేహితుల్లా మసలారు. ప్రసాద్ వేసవి సెలవుల్లో రవి దగ్గరకొస్తున్నట్లు- వచ్చే సోమవారమే భార్యాపుత్రుల సమేతంగా భోపాల్‌నుంచి దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నట్లు వార్త తెచ్చిందా లేఖ.

"ఏం చేద్దాం?" అని ఇద్దరు ఆలోచించటం మొదలుపెట్టారు.

"వాళ్ళకు వాళ్ళవాళ్ళెవళ్ళూ లేరా?" విసుగ్గా అడిగింది లలిత.

"ఉన్నారనుకో. లత తలిదండ్రులు అండమాన్స్‌లో ఉన్నారు. ఆయన కక్కడ ఉద్యోగం. ప్రసాదుకు ఒక అక్కయ్య కొచ్చిన్‌లో ఉంది."

"ఒహో-గతిలేక మనపాలబడ్తున్నారన్నమాట. కొచ్చిన్‌కు వెళ్ళరాదూ?"

"రాశాడుగా-లత హైద్రాబాద్ చూచినట్లుంటుందని!"

"తప్పించుకోలేమా? ఏదో ఒకటి రాసేద్దాం."

"ఉహు...ఏమన్నా అనుకొంటాడు. అసలు నాకొక్క భయం. వాడు చాలా భోళామనిషి. బాగా డబ్బుంది. అటువంటివారి దర్జాలు-తిరుగుళ్ళు-సరదాలు మనబోటివాళ్ళం భరించగలమా అని".

నలుగురు పిల్లలు! పెద్దలిద్దరు! ఈ సిటీలో లింగులింగుమంటూ మనకొచ్చే

కోమలాదేవి



ఆరువందల రూపాయలలో కాస్త వెనకేసుకున్నాము. వీళ్ళ రాకతో ఆ డబ్బంతా హరించుకుపోవలసిందేనా?" సవాలు చేస్తున్నట్టు ప్రశ్నించిదామె.

ఆమె మాటల్లో ఎంతేనా యదార్థముంది. "ఊహూ–హరించుకు పోవటానికి వీల్లేదు". ఆ ఇరువురు చాలాసేపు ఖర్చులెలా తగ్గించుకోవాలో ఆలోచిస్తూ కూర్చున్నారు. ఒక రాగాన పడగానే తృప్తిగా లేచారు.

* *

సికింద్రాబాద్ స్టేషన్‌లో దిగి రవి రానికారణంగా వారు ఆరుగురు పనిపిల్లవాడితోసహా టాక్సీలు చేయించుకుని రవి ఇల్లు జేరారు.

రవి కదలకుండా "హల్లో – ఎదురు చూస్తూ కూర్చున్నాను ప్రసాద్..." ప్రసాద్ కరుకుగా అన్నాడు. "ఎదురు చూస్తూ కూర్చుంటే స్టేషన్ చేరతానను కున్నావా?" అంటూ వరండాలో కొచ్చేసరికి కాలికి పెద్ద కట్టుతో కూర్చున్న రవి కనిపించాడు. ప్రసాద్ అడక్క

ముందే అందుకున్నాడు "మొన్న పాదం తొలగింది. కాస్త బెణికింది. "అంతే కదా," అంటూ కరచాలనం చేశాడు. పరిచయాలయ్యాయి.

కుందనపు బొమ్మలా మెరిసిపోతున్న లతను మరీ మరీ చూడబుద్ధి వేస్తుంది. అలా చూడకూడదని సర్ది చెప్పుకుంది లలిత

వాళ్లకు కేటాయించిన గదిలో సామాను సర్దించింది లలిత. అందరికీ కాఫీలు అందించింది. ఒక్కొక్కరు స్నానంచేసి ఇవతలి కొస్తుంటే ప్రసాద్, రవి కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

"ఈ సంవత్సరం హైద్రాబాద్ ఏమీ బాగులేదనుకో, నీళ్ళు సరిగా రావు. పవర్‌కట్ ఒకటి- తాజా కూరగాయల ధరలు మండిపోతున్నాయనుకో - ఇక పాలా? ఒక్క సీసా దొరుకుతుంది. దానిని పెరుగుకోసం ఉంచి అముల్‌తో కాఫీ చేస్తున్నాము. కాస్త ముందుగా రాసి ఉంటే టైం బాగులేదని రాసేసేవాణ్ణి. మీకు అన్నీ వసతిగా ఉండవేమో అని భయంగా ఉంది," చాల ఫీలవుతున్నట్లు ముఖం మార్చి చెప్పాడు.

ప్రసాద్ తేలికగా నవ్వేశాడు "దట్స్ ఆల్‌రైట్. వచ్చింది తింటానికి కాదుగా? వేసవిలోతప్ప మరోటైంలో సెలవు పెడ్తే కష్టం. పిల్లల చదువులు పాడవుతాయి. బావుల్లోంచి మైలుదూరం నించి నీళ్ల తెచ్చుకోవాలంటే - మరి తెల్లవారు ఝామున అంతా బిందెలు తీసుకుని..."

రవి అతని మాటల కడ్డుతగిలి నవ్వేశాడు. ప్రసాద్‌కూడ నవ్వాడు. లత ఒక్కొక్కరికి గుడ్డలువేసి బైటికి పంపింది. చంటివాడు మాత్రం వెంటనే నిద్రపోయాడు.

లలిత "ఏమన్నా కావాలంటే కేక వెయ్యండి. ఒరే చంద్రం- అమ్మగార్కి ఏమేమి కావాలో చూడు" అని ఓ నవ్వు నవ్వేసి వెళ్ళింది. లలితను చూచి లత చాలా ఆశ్చర్యపోయింది.

మెడలో నల్లపూసలు-పసుపుత్రాడు- చేతులకు నీరుపట్టిన పాత ఏడురాళ్ల కమ్మలు తప్ప ఏమీలేవు! పాపం - లేవు కాబోలు అనుకుంది.

పిల్లలు ఆరుగురు ఎంతో సర్దాగా కేకలేస్తూ ఆడుకుంటున్నారు. ప్లేట్లలో టిఫిన్ సర్ది అతిథుల్ని పిల్చింది. రవి మెల్లగా కుంటుకుంటూవచ్చి కూర్చున్నాడు. రెండేసి ఇడ్లీలు,పచ్చడిఉన్నాయి ఆరేప్లేట్లు, తనపిల్లలుకూడ తినటానికి రాగానే లలిత కసురుకుంది. "ఇందాక నేగా తిన్నారు. మళ్లీ వచ్చారేం? పొండి..."

"రెండేసేగా?" అన్నాడొకడు.

"వెధవా! రెండేసిగాక పల్లెటూరి బైతులా పది తిందామనుకున్నారా? పొండి...తర్వాత అరటిపండిస్తా గాని" వాళ్లు మరేమన్నా అంటారేమోనని

ఉరిమి చూచింది. నాల్గురోజులుగా తల్లి అనవసరంగా ఎందుకిలా గద్దించి మాట్లాడుతున్నదో తెలియక-క్రితంరోజు తొడపాశం గుర్తు కొచ్చి ముగ్గురూ పారి పోయారు."

లత నోరు తెరచుకుని ఇదంతా చూచి మెల్లగా అంది, "చిన్న పిల్లలు. పోనీ మరో రెండు తింటారు. వాళ్ళు ఎగిరే దానికి-అరిచే దానికి ఎప్పుడో అవి అరిగి పోయే ఉంటాయి."

"ఒద్దులెండి, పండ్లిస్తాను" అని బైటి కెళ్ళి మూడు పండ్లిచ్చి వచ్చేసింది. అంతా పెట్టిన రెండు ఇడ్లీలు తిన్నారు-మరి రెండేసి వేసుకున్నారు. ఇంకా తినాలని ఉన్నా అక్కడ ఎక్స్ట్రా ఏమీ లేవు. పిల్లల ఆకలి, వారి తిండితీరు తెలిసిన లత గబగబ వెళ్ళి చేయి కడుక్కొని తాను తెచ్చిన ఒక మిఠాయిడబ్బా తెచ్చి ప్లేటునిండాపెట్టి అందరికీ మూడేసి చొప్పున అందించింది. బైట ఉన్న పిల్లలుకూడావచ్చి తినేసి వెళ్లారు. మరో తెరవని డబ్బా నిండుగా అలాగే బల్లమీద పెడ్తూ, "ఇందులో గులాబ్‌జాం లున్నాయి. భద్రం చెయ్యండి" అంది. "అయ్యో ఇవన్నీ దేనికి?" అని అంటూనే వాటిని భద్రం చేసింది లలిత.

అక్కడే కూర్చుని మాట్లాడుకుంటున్నారు. మాటల సందర్భంలో లలిత అన్నది లతతో "ఆపరేషన్ చేయించుకున్నప్పటి నించి ఒకటే నీరసం. ఆరు నెలలు పూర్తిగా రెస్ట్ అంటారు. మన కెక్కడ కుదుర్తుంది చెప్పండి! అలాగే ఏదో సర్దుకుపోతున్నాను."

"లలిత అనారోగ్యంగా ఉన్నట్లుఅనిపించటం లేదు. బాగానే బలంగా కనబడుతోంది. ఈ సంసారాన్ని పిల్లల్ని దిద్దుకునేసరికి ఎవరికి నీరసమనిపించదు? పాపం" అనుకుంది లత.

అటు రవి ప్రసాద్‌ను హెచ్చరిస్తున్నాడు. "నేనూ సెలవుపెట్టాను. మీతో పాటు తిరగలేనురా. కానీ బస్‌రూట్స్ ఆ నంబర్లు అన్నీ వివరాలు చెప్పగలను. నాల్గురోజులైతే ఆ తర్వాత మెల్లగా వెళ్లి రావచ్చు. ఎన్నాళ్లకనివచ్చారు? నెల రోజులుంటారుగా?"

"చూద్దాం, ఇంకా ఏప్లాన్ వేసుకో లేదు. పది పదిహేను రోజులుండాలని. అక్కయ్య దగ్గరికెళ్దామనివుంది. ఏమో" అంటూ మాటలు నాన్చాడు.

"అదేమిటీ పది-పదిహే నంటావు? ఐనా అదంతా ఇప్పుడెందుకులే, తర్వాత చూచుకోవచ్చు. రెస్ట్ తీసుకో-వంటింట్లో ఏంకావాలో ఓ మాటు కనుక్కుంటాను"

ప్రసాద్ ఇవతలి కొచ్చేశాడు. ఏమేమి కూరగాయలు-సరకులు తేవాలో రవికి చెబుతోంది. ప్రసాద్ అంతగా పట్టించుకోలేదు. ఒక్క కునుకు దీసి లేచేసరికి పదకొండు గంటలైంది.

టీ త్రాగాలనిపించినా ఎందుకులెమ్మని వూరుకున్నాడు. మెల్లగా వచ్చి

ముందర గదిలో కూర్చుని రేడియో ఆన్ చేశాడు. ఏ శబ్దం రాలేదు. రవి వచ్చి నవ్వుతూ అన్నాడు. "అది అలసి పోయింది ప్రసాద్. షాప్ కెళ్లాలి,ఎప్పుడో తీరిక సమయంలో తీసుకెళ్ళాలి" మెల్లగా కూర్చున్నాడు.

"ఏమిటి ప్రోగ్రాం?"

"సాయంత్రం ఎక్కడి కెళ్తే బాగుం టుందటావు?"

నాలుగైదు పేర్లు చెప్పాడు రవి. "పబ్లిక్ గార్డెన్స్‌కు వెళ్ళండి. బావుం టుంది"... అలా కబుర్లలో పడి పోయారు.

పన్నెండు దాటింది. వంటింట్లోంచి పోపు వాసనలు - చుయ్ - సయ్‌మనే చప్పుళ్ళు వినవస్తున్నా భోజనం చేయ టానికి పిలుపు మాత్రం రావడంలేదు. చంటివాణ్ణి వేసుకుని లత హాయిగా నిద్ర పోతోంది. పిల్లలు ఆట చాలించి ఆవు రావురుమంటూ వచ్చి కూర్చున్నారు.

"ఆకలేస్తోంది" - అంటున్నా అటు రవిగాని ఇటు లలితగాని మా ట లు విన్పించుకున్నట్లు లేరు. ప్రసాద్‌మాత్రం "అయిపోయింది లెండి, అత్తయ్య పిలు స్తుంది" అంటూ వారికి ఆశకల్పించాడు. పిల్లలకే కాదు - ప్రసాద్‌కు కూడ ఆక లేస్తోంది. సెలవురోజులు— ఖాళీగా ఉన్న సమయం - తిండిమీదే ధ్యానం కావాలి! పన్నెండున్నర - ఒంటిగంట — ఇంకా వంట అయినట్లు లేదు. లతకు మెలకువ వచ్చింది. సిగ్గుపడింది టైముచూచి. గబ గబ లేచి వెళ్ళింది. పిల్లలు నిద్రపోతు న్నారు. భోంచేశారు కాబోలు ననుకుంది. తనను నిద్రపోతున్నందుకు లేపలేదను కుంది. ముఖం కడుక్కొని లలిత దగ్గర కెళ్ళింది. అప్పటికిగాని పరిస్థితి అర్థంకాలే దామెకు.

వడ్డించి పిల్చేసరికి ఒంటిగంటన్న రైంది. అక్కడ రకరకాల పిండివంటలు లేవు. అతి మామూలు భోజనం. పప్పు— చారు - ఒక వేపుడు — ఒక పచ్చడి. ఈ మాత్రం దానికింత టైంతీసుకుందేం లలిత? ఇదీ ఒక 'కళ' కాబోలు నను కున్నారు. భోజనం చెయ్యబోతే ఏదో ఒక రుచి లోపించినట్లు - లేక ఎక్కువై నట్లో ఉంది. రవి మామూలుగా తృప్తిగా తిని లేచాడు. ఇల్లాంటి తిండి తింటే సునాయాసంగా 'డయట్' చేసి సన్నబడ వచ్చనుకున్నాడు ప్రసాద్. పిల్లల్ని నిద్ర లేపుకొస్తే ఆ మత్తులో సరిగ్గా తినలేక పోయారు. అందునా కారం ఎక్కువో లేక పులుపెక్కువో అయినందువల్ల అసలుకన్నా తక్కువ తిని మళ్ళీ పరి గెత్తి వెళ్ళిపోయి పడుకున్నారు.

ఆ సాయంత్రం టాక్సీలో పబ్లిక్ గార్డెన్స్‌కు వెళ్లారు. తల్లి తండ్రి లేకుండా రవి వాళ్ళ నౌకరు లేకుండా వాళ్ళ ముగ్గురిపిల్లల్ని కూడ వెంట తీసుకెళ్ళి టంతో వారు నానా అవస్థలు పడవలసి వచ్చింది! అందరు ఎనిమిది

సంవత్సరాల లోపువారే। వీళ్లను కూడ తీసుకెళ్ళు ప్రసాద్ అంటే - "ఓ-కె" అన్నాడు. తీరా వెళ్లాకగాని అసలు సాధకబాధకాలు తెలిసాయి కావు. హాయిగా ఆ చల్లగాలిలో రంగు రంగు పూవులతో విరాజిల్లుతోన్న గార్డెన్స్‌లో (ఫరవాలేదు - వేసవి అయినా శ్రద్ధగానే పెంచుతున్నారు।) కూర్చుని ఇహ లోక బాధల కతీతంగా కూర్చోవాలనుకున్న ప్రసాద్ లతలు అనుక్షణం ఈ ఐహికబాధలకే తమకాలం వ్యయం చేయవలసివచ్చినందు కమితంగా బాధపడ్డారు. "పోనీలే పాపం - వాడికి కాలు బాగా లేదు. బావుంటే కూడావచ్చి ఎంతో సాయపడేవాడు. ఆమె-లలిత పల్లెటూరి పిల్ల - ఏదీ అమర్చుకోవటంగాని- అతిథులకు సదుపాయాలు చేయటంగానీ తెలియనట్లుంది. పల్లెటూర్లో తిన్నట్లు పెడ్తోందా తిండి. పాపం ఆ రవి ఎలా నెగ్గుకొస్తున్నాడో పాపం।" అని విచారించాడు.

అనుకున్నట్లు మూడు గంట లుండకుండా గంటన్నర కంతా ఇంటికి తిరిగొచ్చారు. టాక్సీ శబ్దం విన్న రవి-లతలు ముసిముసిగా నవ్వుకున్నారు। అంతవరకు బాగానే నాటకం ఆడుతున్నారు.

పదిమంది ఇంట్లో అడుగుపెట్టగానే అదొక సంత బజారులా తయారయింది. రవి కాలికి ఆవనూనె రాసి మర్దన చేస్తోంది లలిత. ఆ దృశ్యం చూచి ప్రసాద్ అమితంగా ఆనందించాడు. "పోనీ పాపం ఏదో సేవ చేస్తోంది" అనుకున్నాడు.

"వీళ్లు ఐస్‌క్రీం మాత్రం తిన్నారు. త్వరగా భోజనం పెట్టేస్తే పడుకుంటారు" అంది లత.

"అయ్యో - మేము అక్కడికెళ్తే కడుపునిండా ఏదో కొనిపెట్టేసి హాయిగా ఇంటి కొస్తాము. ఏమీ తినకుండానే పడుకుంటారు. నేను — వారు మజ్జిగన్నం తింటే తింటాం లేకపోతే లేదు." లతతో అంటుంటే రవి చిరుగా నవ్వుతూ వింటున్నాడు.

"ఎందుకో రవీ - పిల్లలకి బజారు సరకు కొనిపెట్టటం అలవాటులేదు మాకు. లేనిపోని జబ్బులొస్తాయని భ య ం. అసలు ఈ వెధవ ఐస్‌క్రీంకూడా తినటం ఇష్టంలేదు. కానీ ఏం చెయ్యను - ఆరుగురు ఒకటే వేదించారు. ఆ చంటివాడు కూడా వాళ్ళు తింటుంటే కావాలని ఎగబ్రాకుతుంటే।"

"అయ్యో - అప్పుడప్పుడు ఆ వెధవ బజారుసరుకే వారికి పెట్టాలి. కాస్త కాస్త ఇన్‌ఫెక్షన్‌కు పిల్లల శరీరాలు అలవాటుపడి ఇమ్యూనిటీని పొందుతాయి," అని గలగల నవ్వాడు.

"ఇలా కూర్చుంటే కాదు. ఏదో ఒకటి వండు లలితా" అని ఆమెను పంపుతుంటే ప్రసాద్ లత గుండెలు గతుక్కు-

మన్నాయి. ఒకరినొకరు చూచుకోవా లన్నా ధైర్యం చాలక అతికష్టంతో ఏదో కబుర్లలోకి పడ్డారు.

ఈ పూట కూడా పిల్లలు అర్ధాకలితో పడుకున్నారు.

"అమ్మా ఇంత ఆలస్యంగా ఎందుకు వండుతున్నావు'' అని పెద్దాడు అడిగితే కస్సుమని లేచి వాడి చెవినులిమి "మరో మాటు నన్ను ఏమీ అడక్కు, పో" అని గద్దించింది. ఆమాటలు ఎవరు వినకుండా జాగ్రత్తపడింది. వాడు కన్నీళ్ళు ఆపు కుంటూ మరో గదిలోకి పరిగెత్తి వెళ్ళి పోయి ఏమీ తినకుండానే నిద్రపోయాడు. లలిత ఎంతో బాధపడినా ఒక్కరోజేలే-ఫరవాలేదని మనసు దిటవుచేసుకుంది.

రాత్రి భోజనాలయ్యేసరికి పది గంటలు దాటింది. వంకాయకూర పెసర పప్పుచారు చేసింది. బాగా పులిసిన మజ్జిగ ఎంతో ఆప్యాయంగా వడ్డిస్తుంటే రవి బాగానే తిన్నాడు. ప్రసాద్ - లత ఆమె కొసరి కొసరి వడ్డిస్తుంటే అతి కష్టంతో తిన్నా కంచాలు ఖాళీచేయలేక పోయారు.

"మీవి మరీ నాజూకుతిళ్ళు అన్నయ్య గారూ" అంటూ నవ్వింది. "ఈవంకాయ కూరుంటే ఇకఏమీ అక్కర్లేదులలితా" అని ఎంతో మెచ్చుకుంటుంటే ఆమె పొంగిపోతూ సిగ్గు అభినయించింది.

ఆ రాత్రి ప్రసాద్-లత "ఒక్కరోజు గడిచింది" అనుకున్నారు.

మరుసటిరోజు "సంకటి" లా ఉన్న ఉప్మాతో సర్దేసింది లలిత. ఇక లాభం లేదనుకుని తొమ్మిదింటికి కల్లా సైట్ సీయింగ్‌కు బయలుదేరారు. వెళ్ళక ముందు రాత్రికే వస్తామని భోజనం సిద్ధంగా ఉంచొద్దని చెప్పి మరీ వెళ్ళారు.

వారు కనుమరుగయ్యాక విరగబడి నవ్వాలనిపించినా పిల్లల ఎదుట బైటపడి పోతామేమో అనుకుని అర్థాంతరంగా పర స్పరం చూచుకున్నారు.

ఆ పూట మామూలువంటే అయినా రుచిగానే వండుకు తిన్నారు. అక్కడ వాళ్ళు సరాసరి హోటల్‌కెళ్ళి కడుపు నిండా తిని తిరగటానికి బయలుదేరారు. ఆ రాత్రికూడ భోజనాలు ఆలస్యమే అయ్యాయి కానీ పిల్లలకు బాగాతినిపించి తెచ్చారు-అందుకని వారు నిద్రమత్తులో సరిగ్గా తినకపోయినా వాళ్ళు బాధపడ లేదు.

ఆ రాత్రికి "హమ్మయ్య - రెండు రోజులు గడిచాయి'' అనుకున్నారు. మరుసటిరోజు తెల్లారి రవితో అన్నాడు "నా ఫ్రెండ్ ఒకడు కనిపించాడు. రేపు రాత్రికి భోజనం అక్కడే. బాగా రాత్రి అవుతే అక్కడే పడుకుని తెల్లవారి వస్తాము."

ఆ ప్రొద్దుట పూరీలు అనబడే రొట్టె ముక్కలు, బంగాళదుంపకూర పెట్టింది. కూర చాలాబావుందని రవిమెచ్చుకుంటూ తిన్నాడు. నౌక రుచిన్న లెదర్‌సూట్‌కేస్

చిన్న రెటానేబుట్ట తీసుకురాగా అంతా బయలుదేరి సరాసరి ద్వారకా హోటల్‌కి వెళ్ళారు. అక్కడే పెద్దగది తీసుకుని కాసేపు విశ్రాంతి తీసుకుని సాలార్‌జంగ్ మ్యూజియం చూచి రాత్రికి పడుకుని తెల్లవారి బ్రేక్‌ఫాస్ట్‌చేసి ఇంటికి బయలు దేరారు. ఇల్లు చేరిన వెంటనే "అయ్యో టిఫిన్ చేస్తాను" అని లలిత పంతం పట్టింది - ఆమెను ఆ కార్యక్రమం నించి విరమింపచేస్తానికి వారికెంతో కష్టమైంది.

"పాపం - ఎంతో చేయాలని వుంటుంది. సరిగా రాదు" అని జాలి పడింది లత.

"రవీ! ఈ రాత్రికి రవీంద్రభారతిలో కూచిపూడి నాట్య ప్రదర్శన జరుగు తోంది. నీకుకష్టమేమో లలితనుపంపించ రాదూ? నువ్వు పిల్లలు ఇంట్లోఉండండి".

రవికి ఆ ఛాన్స్ మిస్‌కావటం ఇష్టం లేదు. కానీ తప్పదు. ఒప్పుకున్నాడు. ఆ సాయంత్రం త్వరగానే వంటముగించి భర్తకన్నీ అప్పగించింది.

లత చక్కగా ముస్తాబై ముత్యాలు కెంపులు పొదిగిన ఆభరణాలు పెట్టు కుని తెల్లక్రేప్‌సిల్క్‌మీద జరీపూలుకుట్టిన చీర, తెల్లరవికె వేసుకుని ఇవతల కొచ్చింది.

ఆ సుందరరూపాన్ని కళ్ళింతింత చేసుకుని చూచింది రవి కూతురు రమ.

పరిగెత్తుకుంటూ తల్లి గదిలో కెళ్ళింది.

ముదర కనకాంబరం రంగు చీరెకు నలుపు జరీఅంచు-బెత్తెడుఉన్న చీరకట్టు కుని తెల్లటి రవికె వేసుకుని రాళ్ళనెక్లెస్ పెట్టుకుంది. ఆమెను తదేకంగా చూస్తూ నుంచుంది ప్రసాద్ కూతురు వినయ. ఎందుకో ఆపిల్లకు అత్త అంత అందంగా కనిపించలేదు.

తల్లినిచూచి ముఖంచిట్లించి 'అమ్మా' అని ఏదో అడగబోయేసరికి లలిత ఒక్క కసురు కసిరి "ఫో, అవతలికి-ఆడుకో పొండి" అంది రమను. తల్లిని ఇంత సాధారణ డ్రస్సులో రమ చూచి ఎరు గదు. ఇవతలికి రాగానే ఆడపిల్లకు ఉక్రోషం వచ్చింది. "వినయా! మా అమ్మకుకూడ ముత్యాల గాజులు - నెక్లెస్ - చెవులకు రింగులు - ఉంగరం- ఉన్నాయి, తెలుసా?" అంది.

పెదాలకు ట్రాన్స్‌పరెంట్ లిప్‌స్టిక్ దిద్దుకుంటున్న లతకు అద్దంలోంచి ఆ పిల్లలు కనబడ్తున్నారు. వారి మాటలు వినవచ్చాయి. వాటికంత ప్రాధాన్యత ఇవ్వలేదు.

కానీ లలితను చూడగానే ఎందుకో ఆ పిల్లమాటలు హృదయాన్ని తట్టినై. 'పాపం-చక్కగాఉన్నా అలంకరించు కోటం రాదు.' అనుకుని లలితను సమీ పించి అన్నది. "మీ రమ ఇప్పుడే అంది మీకు ముత్యాల సెట్టుందని, పెట్టుకోండి. ఇద్దరం సరదాగా ఒకే రకమైన నగలు పెట్టుకుంటే బావుంటుంది."

లలిత పకపక నవ్వి రహస్యంగా అంది "మనం స్నేహితులం. మీకు. చెప్పినాఫరవాలేదు. అవి నకిలీవి"అంది.

"ఓ"- అని మౌనం దాల్చింది లత.

డాన్స్‌ప్రోగ్రాం మూడు గంటలు. అంతాచూచి ఇల్లు జేరేసరికి పదకొండు గంటలైంది. ఏదో తిన్నామనిపించి పడు కున్నారు.

ఆ రాత్రికి అనుకున్నారు నాల్గు రోజులు గడిచిపోయాయి-అని. మరు సటిరోజు రవి ఆఫీసుకు బయలుదేరా లనుకున్నాడు. లలిత తలనొప్పితో లేచింది. రోజూ లత సాయంచేద్దామన్నా లలిత చేయనిచ్చేది కాదు. ఆరోజువద్దన టానికి వీల్లేకపోయింది. లత కాఫీ ఉప్మా చేసింది. మధ్యాహ్నం భోజనం తనే తయారు చేసింది.

లలిత అంతసేపు విశ్రాంతిగ పడు కుంది. రెండేళ్ళయింది తను ఇంత హాయిగాపడుకుని-నాటకం బాగానే ఆడు తున్నామని మురిసిపోయింది. పాపం ప్రసాద్‌కు-లతకు అణుమాత్రంగానైన అనుమానం కలగలేదు.

మధ్యాహ్నం మూడింటికల్లా బయలు దేరి వెళ్ళిపోయారు సైట్‌సీయింగ్‌కు.

"దేవిగారి అలసట తీరిందా?'' అని కొంటెగాచూస్తూ అడుగుతుంటే లలిత ముసిముసిగా నవ్వింది. "అప్పుడే సాయంత్రమా?'' అని కాఫీ పెట్టడానికి లేచింది.

"కాస్త రుచిగా వండితే ధన్యులం'' అంటుంటే లలిత విరగబడి నవ్వింది. "ఇదంతా మనం వేసుకున్న ప్లాన్ అని వాళ్ళకి తెలియనివ్వకుండా బాగానే జరుపుకొస్తున్నాము'' అంది ఎంతో గర్వంగా.

అక్కడ లతా - ప్రసాద్‌లు అను కున్నారు – లలితకు ఒంట్లో కులాసాగా లేదు. నిజమే. ఇంతమందికి వండి వడ్డించ టం మామూలువిషయం కాదు. అందునా లలితలాంటి తేగుడు ముఖాని కిది పెద్ద సమస్యే. కనుక మరుసటిరోజు తెల్లవారి హోటల్‌కు పర్మనెంట్‌గా వెళ్ళిపోతే మంచిదనుకున్నారు.

ఆ రాత్రికి రవితో అంటె-రవి ఎంతో నొచ్చుకుంటున్నట్టు నటించాడు. ''నెల అని, పదిహేను రోజులని, నాలుగు రోజుల్లో వెళ్తావా?'' అని నిష్ఠూరంగా మాట్లాడాడు.

"నువ్వు అర్థంచేసుకోరవీ. టాక్సీలకు రానూ పోనూ బోలెడవుతుంది. మీ ఇల్లు మరీ ఒక కొసకు ఉంది. లలితఆరోగ్యం బాగులేదని లత చెప్పింది. వెళ్ళకముం దొకమారు వచ్చి చూచి వెళ్తాంలే" అని ఒప్పించాడు. లలిత చాలా బాధపడి నట్లే కనబడ్తూ వారు వెళ్ళటం తనకెంతో అయిష్టమన్నట్లు ముఖం పెట్టుకుని సాగ నంపింది.

ప్రసాద్ వెంటనే స్టేషన్‌కెళ్ళి అక్కయ్య కొచ్చిన్‌లో ఉంటే ఆమెను చూడాలని టిక్కెట్లుకొని రిజర్వేషన్ చేయించి వచ్చాడు. మరోవారంలో వారు స్నేహితులనుపిలవటంతోఊరుచూట్టంలో



కాలం గడిపి హాయిగా హోటల్‌లో ఉండి ఆఖరు రోజున గుడ్‌బై చెప్పటానికి రవి ఇంటి కొచ్చారు.

"అంతా బాగానే జరుపుకొచ్చాము. అటు మనం సరిగా చూడలేదన్న నేరం వెయ్యలేదు – ఇటు మనం బ్రతికి బైట పడ్డాము" అనుకున్నారు లలిత-రవిలు.

మరి ఆఖరురోజు సాయంత్రం ఫోంచేసి వెళ్ళమని పట్టుబడ్తే తప్పలేదు వారికి. సంతోషంగానే ఉండిపోయారు.

ఇంతలో బైట రిక్షా ఆగటం లలిత మేనమామ గలగల వాగుతూ లోపలికి రావటం జరిగిపోయాయి.

లలిత-రవి గుండెలు ఒక్కమాటు అదిరిపడ్డాయి.

"ఈ మనిషినోరు ఊరుకోదే బాబూ కాస్త హింట్ ఇవ్వాలి" అనుకున్నా రెవరికి వారు.

కానీ లోపలి కొస్తూనే ప్రసాద్‌ను చూచి అవాక్కయిపోయి కుర్చీలో కూర్చుండి పోయాడు. ముఖంఆనందంతో విప్పారింది. కాసేపు ఆగి అన్నాడు "నాయనా – నువ్వు అనందరావుగారి కొడుకువి కదూ? నీ పెళ్ళికొచ్చాను. నేను నీకు తెలియదులే. మీ నాన్నగారి హయాంలో మా పల్లెకెంతో మేలుజేశారు.

ధర్మాత్ములు. ఇప్పటికీ వారిమేలు మరిచి పోలేము. అంతేనా? మా రవికి మీనాన్న గారి వల్లేగా ఇంత మంచి ఉద్యోగం వచ్చింది – అబ్బో తెలివికేం తక్కువ లేదు. బాగా సంపాదిస్తున్నాడు... మా ఊళ్లోనే రెండెకరాలు మాగాణి కొని పించాను...అంతా మీ తండ్రిగారిచలువే. చెప్పేవుంటాడు రవి ... "అమ్మాయ్ లలితా...'' అంటూనే ఉన్నారు. లలిత చెంబునిండా నీళ్ళు తెచ్చి అందించింది.

ఆమెను పలుకరించి ఆమెవేపు చూపు నిల్పి ''ఏమ్మా లలితా నీ నగలన్నీ ఏవీ? అలా బోసిమెడతో ఉన్నావు?"

లలిత వెకిలిగానవ్వి ప్రసాద్ లత వైపు సిగ్గుపడ్తున్నదానిలా చూచి మెల్లగా అంది "ఇక్కడ ప్లాట్లు అమ్ముతున్నా రట. బాంక్‌లో పెట్టి డబ్బు తెచ్చారు."

"ఓ... అదా... త్వరగా తెచ్చు కోండి" అంటూ నవ్వేశాడాయన. నాల్గు చెంబులు నీళ్ళుపోసుకుని అప్పుడే వచ్చిన రవి ఈయనను పలుకరించి కుశల ప్రశ్నలు వేశాడు. అతడు బహు మాట కారి- 'నాలుకమీద సరస్వతి సదా నాట్యమాడుతోంది' అనుకుంది లత.

భోజనాలదగ్గర పెళ్ళిళ్ళ ప్రసక్తి వచ్చింది_ఆయనఅంటున్నాడు''శాంతకు పెళ్ళి. వాళ్ళ రాముబావే. నాల్గు నెలలు పోయాక ముహూర్తం పెట్టుకోవాలను కుంటున్నాము. నీవు చేయించుకున్న ముత్యాలసెట్టు–అదే డిజైనులో కావాలట. వాళ్ళ బావే ఇచ్చాడులే డబ్బు. ఎన్ని వేలేమిటి ! మూడు నాల్గువేల మధ్యలో అవుతుందిగా... ఏమిటమ్మా లలితా బొత్తిగా ఇల్లా వండావు? చుట్టాలొచ్చిన వేళ గాభరాతో సరిగా వండలేదా ఏమిటి నీకేం తొందరే...చక్కగా చిటికెలో వందమందికి సంతుష్టిగా పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి పంపగల విద్య ఉంటే ఈ పూట నీ చెయ్యి వెనుదిరిగిం దేమిటి?...మీ అక్కయ్య నవనవలాడే వంకాయలు కట్టింది. నీచేతి నూనె వంకాయకూర తిని ఎన్నాళ్ళయింది?...'

ప్రసాద్‌కు, లతకు ఈ మాటల్లోని యదార్థం గ్రహింపుకు రాగానే తెగించి రవి_లలితల వైపు చూచారు. వారిద్దరి ముఖాల్లో భయాందోళనలుగాని – సిగ్గు గాని లేదు. వెకిలిగా నవ్వుతూ ఏదో మాట్లాడుతూ మాటలు తప్పింప చూస్తు న్నారు. ''ఔరా!'' అనుకున్నారు వీళ్ళి ద్దరు.

''నాకేంవచ్చు, కోడలినన్న అభి మానంతో అంటున్నావు" అంటోంది.

ప్రసాద్ అనుకున్నాడు ఇంతటితో అగితే బాగుండునని. కానీ అల్లా జరగ లేదు. అతడు ఆస్నేహితు లిద్దర్నీ మరీ ఇరకాటంలో పడేశాడు. "పోయిన సోమ వారం రాముతో నెయ్యి-పూత రేకులు – కొబ్బరికాయలు - ఆవకాయ - మాగాయ అన్నీ మీ అమ్మ పంపితే, చక్కగా అందు కుని ఒక్క ఉత్తరం ముక్కైనా రాశావు

కాదేమమ్మా. ఆవిడ అందినట్లు తెలిసినా నీ చేతితోరాసిన ఉత్తరంకోసం రోజూ ఎదురు చూస్తూనేఉంది...'' ఇక చాలు. వినవలసినదంతా విన్నారు.

రవి-లలిత కొంపమునిగిందని ముస లాడిమీద లోలోపల మండిపడ్డారు.

ప్రసాద్, లత తొణకలేదు.మామూలు గానే వెళ్లొస్తామని చెప్పి వెళ్ళిపోయారు.

"కొంప ముంచావు మామయ్యా" అంటూ వాపోయింది. పిల్లలు నిద్ర పోయిన తరువాత-తాము ఎంత నేర్పుగా వారి బెడద వదిలించుకున్నది చెప్పి అతని మాటల వల్ల తమ పన్నాగం బైట పడిందని చెప్పి చాలా బాధపడుతుంటే ఆయన నోరుతెరుచుకుని విన్నాడు.

ఆ పెద్దమనిషిహృదయం తీవ్రంగా బాధపడింది. "స్నేహితుణ్ణి - అందునా ఉద్యోగం దొరక్క రెండేళ్ళు అత్తారింట్లో కూర్చున్న నీకు పిలిచి ఉద్యోగం ఇచ్చినట్లే ఇప్పించినవాడికి ఎంతచేసినాఋణం తీర్చుకోలేవే! ఎంతపని చేశావు లలితా. ఒకరికొకరుతోడై మంతనాలాడి వారిని వెళ్లగొట్టారన్నమాట. ఏం పాడుబుద్ధిరా బాబూ. స్నేహం అనేది ఎంతో పవిత్రమైంది. అది నిష్కల్మష హృదయాలనే ఆశ్రయిస్తుంది. స్నేహధర్మం, ఆ అనిర్వచనీయభావం మీలాటివారికేం తెలుస్తుంది! వెళ్లండి. వెళ్లి క్షమాపణకోరండి" అని మొత్తుకున్నా వారిరువురు కదల్లేక పోయారు. ఏం ముఖం పెట్టుకుని వెళ్తారు.

రేపు వారిప్రయాణం. వ్యవధి వుంది. కాని వారికంత పశ్చాత్తాపం కలగలేదు. అవమానంతో సిగ్గుతో ఇంట్లోనే వుండి పోయారు. క్షమ అర్థించటానికికావలసిన ఔన్నత్యంలేదు వారిలో.

వారంరోజులకు ప్రసాద్‌నించి వచ్చిన ఉత్తరాన్నందుకుని కంపిస్తోన్న చేతులతో తెరిచాడు రవి. కొచ్చిన్ నించి వచ్చింది.

"రవీ,మీ మామయ్యను తిట్టుకోవద్దు, ఆయనది నిర్మలమైన హృదయం. అందుకే నాన్నగార్ని గూర్చి మాట్లాడుతూ కృతజ్ఞతలు వెళ్ళబుచ్చాడు. అతడు మహనీయుడు.

రవీ, స్నేహాన్ని డబ్బుతో లెక్కించావు. నీకు చిన్నజీతమని నాకు తెలియదా? ఇంతమందితో వచ్చి నీచేతఖర్చు చేయిస్తానని ఎలా అనుకున్నావు?

ఆ రోజు సాయంత్రంవరకు నిన్ను నమ్మాను. నీకు తగిన భార్య అనిపించుకుంది లలిత. లతహృదయం గాయపడింది, క్షోభించింది. నీలాంటివారుంటారన్న సత్యం ఒకప్పుడు విశ్వసించలేదు గాని ఈనాడు విశ్వసిస్తున్నాను.

జీవిత రంగంలో ఈనాటకాలు రాణించవు, అసలైన జీవిత విధానమే రాణిస్తుంది. 'రవి'